# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సమావేశం ఈరోజు (13) విజయవాడ (మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం)లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశాలకు పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, యం.ఏ.బేబి లు హాజరయ్యారు. సమావేశం 14వ తేదీ కొనసాగుతుంది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం/ ప్రసారార్థం మీకు పంపుతున్నాము. – జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

## తీర్మానం

## రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని
## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలి

రాష్ట్రంలో సుమారు 50 వేల మంది మున్సిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ ఇతర విభాగాలు మరియు పర్మినెంట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ప్రజారోగ్యం, పర్యావరణం, పట్టణాల పరిశుభ్రతలో పౌరసదుపాయాల కల్పనలో కీలకమైన పాత్ర పోషిస్తున్న ఈ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమ్మెను విరమింపచేసి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలకు రూ. 18 వేలు జీతం చెల్లిస్తామన్న హామీతో సహా కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్, ఒప్పందం కార్మికులకు సమాన పనికి – సమాన వేతనం చెల్లిస్తామన్న హామీలను అటకెక్కించారు. పైగా ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రతకై భరోసా కల్పిస్తామన్న హామీకి భిన్నంగా 'ఆప్కాస్'ను తెచ్చి మున్సిపల్ కార్మికులు వద్దంటున్నా లెక్క చేయకుండా బలవంతంగా అందులో చేర్చారు. ఏ విధమైన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, బిడ్డలకు ఉపాధి కల్పించకుండా వందలాది మందిని విధుల నుండి తొలగించారు. ఇంకో వైపు ఆదాయ పరిమితితో నిమిత్తం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారిశుద్ధ్య, మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తామన్న నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది.

ఇంజనీరింగ్ కార్మికులకు, ఎన్‌యంఆర్, ఇతర విభాగాల కార్మికులకు నైపుణ్యానికి అనుగుణంగా జీతాలు చెల్లించడంలేదు, పర్మినెంట్ కార్మికులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ అక్కౌంట్లు, హెల్త్ కార్డుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టడం, పెన్షనర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం మొదలైన సమస్యలు మున్సిపల్ కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని మిగిల్చాయి.

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరోనాకు ముందు నుండి అమలు చేస్తున్న ఆక్యుపేషన్ హెల్త్ అలవెన్సును గత జనవరి నుండి చెల్లించకపోవడం అగ్నికి ఆజ్యం పోసింది. నెలకు ఇస్తున్న రూ. 6,000/– లను కోతపెట్టి రూ. 3000/– ఇస్తామనటం 2024 ఎన్నికల్లో మరలా మా ప్రభుత్వం వచ్చిన వెంటనే పెంచుతామని మంత్రులు చెప్పడం పారిశుద్ధ్య కార్మికులను తీవ్ర ఆందోళనలకు గురిచేసింది.

గత్యంతరం లేక కార్మికులు సమ్మెలోకి దిగితే శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడం మానేసి "సమ్మె విరమించి వస్తేనే చర్చలు జరుపుతామంటూ నిరంకుశ పోకడలు పోవడాన్ని సీపీయం ఖండిస్తున్నది. కార్మికులు కోరుతున్న కోర్కెలు కొత్తవేమీ కాదు. గత డిసెంబర్ వరకు ఇచ్చిన హెల్త్ అలవెన్సులో ప్రభుత్వం కోత పెట్టకుండా మొత్తం రూ.21 వేలు ఇవ్వాలనేది న్యాయమైన డిమాండ్. రాష్ట్ర ప్రభుత్వం బేషజాలకు పోకుండా కార్మిక సంఘాలను వెంటనే చర్చలకు ఆహ్వానించాలి. రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు, ప్రజారోగ్యం పరిరక్షణను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి జోక్యం చేసుకుని కోర్కెలను అంగీకరించి సమ్మెను విరమింపజేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది.

= = = =